# పనిమంతురాలు

-కేతు విశ్వనాథరెడ్డి

రంగు వెలిసిన ఆకుపచ్చ అంచు వంకాయ రంగు కోక పైటె కొంగును, పుల్లమ్మ నడుం చుట్టూ బిర్రుగా లాక్కొని, చెక్కుకుంది. నెత్తికి సైను పావడా ముక్కను చుట్టుకుంది. ఎనిమిది అడుగుల వెదురు బొంగు నిచ్చెనను కదలకుండా గోడకు ఆనించింది. చిన్న సత్తు బకెట్లో సున్నం పోసుకుంది. నిచ్చెన మూడు మెట్లు ఎక్కి సున్నం బకెట్టును పై మెట్టుకు నులకతాడుతో గట్టిగా కట్టింది. కుడి చేత్తో ఈత పరకను తీసుకుంది. సున్నం బకెట్టులో ఈత పరకను ముంచుతూ, తీస్తూ, సున్నపు ధారలు పక్కల కారిపోకుండా, గోడకు సున్నం కొడుతోంది- చూరు అంచుల నుంచీ, కుడి చేతికి అందినంత వరకూ, అడ్డంగా, నిలువుగా పట్టెలు కలుపుతూ. నిచ్చెనకు కట్టిన చిన్న బకెట్లో సున్నం అయిపోయినప్పుడల్లా, తాడు విప్పి, నిచ్చెన దిగి, కింద పెద్ద బానలో కలిపి ఉంచిన సున్నాన్ని మరొకసారి కలబెట్టి, చిన్న బకెట్లు పోసుకొని, నిచ్చెన ఎక్కి పని కానిస్తోంది. నిచ్చెన మెట్లు ఎక్కడం, దిగడం, ఒక వార సున్నం పూత పూర్తి కాగానే, మరో వారకు నిచ్చెన జరుపుకుంటూ, కదలకుండా నిలబెట్టుకుంటూ సున్నం కొడుతోంది. పనిలో మునిగిపోయిన పుల్లమ్మను, ఇంటి ఇల్లాలు గమనించింది. తృప్తి పడింది. పైటేల దాటుతూ ఉందని జ్ఞాపకం వచ్చింది.

"అమ్మేయ్ పుల్లమ్మా!"

ఇంటి ఇల్లాలు పిలుపుకు, పుల్లమ్మ నిచ్చెన దిగకుండానే మెడ తిప్పి, అడిగింది:

"ఏందమ్మా! సున్నం పూత పల్చగా కన్పిస్తాందా? ఆపక్క ఆరిన దిక్కు చూడమ్మా, తెలుస్తాది."

"నీ తలకాయ! నీ పనికి ఎన్నడన్నా వంకలు బెట్టినానా? కూలి మిగతా వాండ్ల కంటే ఒక రూపాయ ఎక్కువ అడగతావనుకో. నీ కష్టం నీది. మా ఇబ్బందులు మావి. నువ్వు సున్నం పూసినా, ఇండ్లలికినా, కలుపు దీసినా మాట పడకుండా చేస్తావు. అమ్మేమ్! అది సరే చూడు! ఎండ గడప దాటింది. నిచ్చెన దిగు. ఇంత సంగటి తిందువు," ఇంటి ఇల్లాలు నవ్వుతూ అంది.

ఇంటి ఇల్లాలి మాటలకు పుల్లమ్మ ఉబ్బిపోయింది. నిచ్చెన దిగి అంది:

"పని చెయించుకునే వాళ్లు, ఊరికూరికే వంకలు పెడ్తా, అరవకపోతే పనోళ్లు బాగా చేస్తారమ్మా. ఎవరన్నా అంతే... ఇదుగో అమ్మా! సున్నం ఎక్కువ పట్టేట్లుంది. మాసిన గోడలు, మైల బట్టలు ఒకటే..."

ఇంటి ఇల్లాలు ఇబ్బంది పడిపోతూ అంది:

"మంచి మాటన్నావు. సున్నం ఎక్కువ పట్టితే పట్టనీ. ఏం చెయ్యాల? మూడేండ్లయ్యింది ఇంటికి సున్నం కొట్టించి. కరువులూ, రోగాలూ. కర్చు మీద కర్చులు. ఈ ఉగాది ముందు ఇది తప్పలేదు. రెడ్డి ఆ మద్దెన పెద్ద జబ్బు పడె. మా ఇంటి దేవత తాళ్లమాపురం మైసూరమ్మను మర్చిపోవడం వల్లనే జబ్బొచ్చిందని ఎవరో గిలిపెట్టిరి. మైసూరమ్మకు యాటను కూడా కొడతామని అనుకుంటిమి. అదుగో ఆ మాటను బట్టుకొనే ఇప్పుడు రెడ్డి బండ్ల మిద్దెలో ఉన్నాడు. ఏం చెయ్యాల?"

"ఏం చేస్తామమ్మా! ఎవరి కష్టాలు వాళ్లు చూసుకోవలసిందే" అంది పుల్లమ్మ.

ఇంటి ఇల్లాలు మాట మారుస్తూ అంది:

"కష్టాలంటే... నిజమేలే. నీ తమ్ముడుండాడు. ఒట్టి పనిదొంగ. బుద్ధి కూడా కుదురైంది గాదు, నీ మాదిరి. పైగా తిరుగుబోతు, అమ్మేయ్ పుల్లమ్మా! ఒకే కడుపున వేరువేరు బుద్ధులుండేవాళ్లు ఎట్లా పుడతారబ్బా, ఇట్లా? ఏందోలే, ఇవన్నీ. ముందు మొగం కడుక్కొని కూర్చో."

ఇంటి ఇల్లాలు, పల్లెంలో ఒక సంగటి ముద్ద, ఇంత నల్ల కుసుమల ఊరుమిండి, వంకాయ తాలింపు వేసి తెచ్చి పుల్లమ్మ ముందు పెట్టింది. చెంబులో మంచి నీళ్లిచ్చింది. చల్లారిపోయిన సంగటి ముద్దను, అయిదు వేళ్లతో ఉంటలు, ఉంటలుగా తీసుకుంటూ, ఊరుమిండిలో అద్దుకుంటూ వంకాయ తాలింపులోని ముక్కల్ని నంజుకుంటూ పుల్లమ్మ తినసాగింది. పుల్లమ్మకు కాస్తా ఎడంగా కూర్చుని కబుర్లలో పడింది.

"అమ్మేయి పుల్లమ్మా! నీకు పెండ్లి కుదిరిందంటనే. నువ్వు చెప్పకపోతే తెల్దా? మీ నాయన, మా రెడ్డితో, చెప్తా ఉంటే విన్నానే, ఆ మొన్న. కాబోయే అల్లున్ని గురించి, మీ నాయన పెద్ద ఇదిగా చెప్పినాడులే. నీకంటే పదేండ్లు పెద్దంటనే. అయితే ఏంలే? అదేందీ ఆరెంపీ డాకటరు అంటనే? ఎర్రగా, బాగా ఉంటాడని కూడా మీ నాయన పొగిడినాడు. అయితే, నీకు మాత్తరం ఏం తక్కువ? చెలాకీగా, సన్నగా ఎంత బాగుంటావు? నలుపుగా ఉంటే ఏమైంది? నీ మొగం కళ ముందు ఎర్రమూతి కోతుల మొగాలు దిష్టి తియ్యాల్సిందే. ఎరుపు ఎరుపని ఏడుస్తారు గానీ..."

ఇంటి ఇల్లాలి మాటలు పుల్లమ్మకు గిలిగింతలు పెట్టాయి.

"పోమ్మా! నువ్వు మరీను," అంది సిగ్గుపడుతూ.

"అమ్మేయి! పెండ్లయినాక మనూరునూ, మమ్మల్నూ మర్చిపొయ్యేవు," అంది ఇంటి ఇల్లాలు, పరిహాస ధోరణిలో.

"ఎట్లా మర్చిపోతానమ్మా?" అంది పుల్లమ్మ.

"ఏమో! కూర్చోబెట్టి సాకీ మొగుడొస్తాండాడు గదా?"

ఇంటి ఇల్లాలి ప్రశ్నకు ఏం జవాబివ్వాలో తెలియక పుల్లమ్మ నవ్వి ఊరుకుంది.

ఫాల్గుణ మాసంలో పల్లెల డాక్టరు వెంకటముని, ఆర్.ఎం.పి.తో పుల్లమ్మ పెళ్లి జరిగిపోయింది. పెళ్లికి ముందు, రెండు రోజులు తప్ప, మిగతా రోజుల్లో పుల్లమ్మ ఆ పనికీ ఈ పనికీ కూలికి వెళ్లింది.

నిషేకం రోజున వెంకటముని, భర్తగా పుల్లమ్మకు కొంత అర్థమయ్యాడు:

"మీ నాయన ఒకప్పుడు కట్టుబడి. ఇప్పుడు విలేజి సర్వెంట్. ఊరి పెద్దల వత్తాసు ఉందని సంబంధం తెచ్చినవాళ్లు చెప్పినారు. ఇది మనకు మంచిది. నేను డాక్టర్ని. నిన్ను చూసినా, ఒప్పుకున్నా," అన్నాడు.

ఉగాది మనుగుడుపుల్లో వెంకటముని మరికొంచెం అవగతమయ్యాడు. పనికంటే ఆర్భాటం ఎక్కువ అని పుల్లమ్మ గమనించింది. తమ్ముడు పుల్లన్న, భర్త ఎచ్చులెచ్చులు మాట్లాడుకోవడం కూడా పుల్లమ్మ వింది.

కాపురం పెట్టాక, నెలరోజుల్లో మొగుడి సంపాదనా, చేసే దుబారా, అలవాట్లూ పుల్లమ్మకు తెలిసి వచ్చాయి. ఓర్చుకుంది. ఈలోగా పక్క పల్లెలో కొత్తగా వచ్చిన మరొక నాటువైద్యుడు వచ్చాడు. వెంకటమునికి పోటీగా తయారయ్యాడు. ప్రొద్దుటూరులోని రెండు మూడు నర్సింగ్ హోములతో నాటు డాక్టరుకు ముందే సంబంధముంది. అతను పల్లె జనం నాడిని పట్టుకున్నాడు. అప్పు చేసో, సప్పు చేసో టౌన్లో నర్సింగు హోములకు వెళ్లి చూపించుకోవడం మీద రైతులకు శ్రద్ధ పెరిగింది. వాళ్లకు ఉన్నదీ లేనిదీ చెప్పి అక్కడికి పంపటం, వాళ్లిచ్చే కమీషన్ తీసుకోవడం వృత్తిలో భాగమైంది. అతని వైద్య చాతుర్యానికి, వెంకటముని సంపాదన సన్నగిల్లుతూ పోయింది. బీదా బిక్కీ ఇచ్చే రెండు మూడు రూపాయలకు వెంకటముని వైద్యం పరిమితమైంది. మొగుడు చెప్పకపోయినా, పుల్లమ్మకు వైద్య నారాయణుల ప్రపంచం తెలుస్తూనే ఉంది.

ఇల్లు గడవాలి. పెద్ద ఊరు. పుల్లమ్మకు కూలి పనులు దొరికాయి. వెళ్లడం మొదలుపెట్టింది. ఆర్.ఎం.పి. డాక్టరు మొగుడు అది నామర్దా అనలేదు. ఈలోగా ప్రొద్దుటూరులోని ఒక నర్సింగ్ హోమును తంటాలుపడి పక్కూరి నాటు డాక్టరు పద్ధతిలోనే వెంకటముని లాయకీ చేసుకున్నాడు. అతని శరీర రాజకీయం దానికి తోడ్పడింది. సంపాదన పెరగడం మొదలుపెట్టింది.

ఒకరోజు వెంకటముని తన ప్రతాపాన్ని పుల్లమ్మ ముందు చూపనే చూపాడు:

"ఒకటి రెండుసార్లు మనింటికి వచ్చినప్పుడు చూసినావు- సుగుణ అని. హెల్త్ వర్కర్. నీ కంటే బాగుంటుంది ల్యా. నా రంగు. వాళ్లక్క మా నర్సింగు హోములో నర్సు. నాకూ, సుగుణకూ మన పెండ్లి కాక ముందు నుంచే బాగా ఇది... ముందు ముందు మంచి రోజులుంటాయి..."

ఆ 'ఇది'కి పుల్లమ్మ జడుసుకుంది. మంచి రోజులకు నిదర్శనంగా ఒక రాత్రి తన సామాన్లతో ఏకంగా దిగిన సుగుణను చూసి, పుల్లమ్మ దిమ్మదిరిగిపోయింది. వెంకటమునీ, సుగుణా ఉదయం లేస్తూనే సంచులు భుజాల వేసుకొని ఎవరిదారిన వాళ్లు వెళ్లేవాళ్లు. ఏ రాత్రికో ఇల్లు చేరుకునే వాళ్లు. మూడు, నాలుగు వారాల్లోనే సంసారమంటే పుల్లమ్మకు వెగటు పుట్టింది. మొగుడు దృష్టిలో తాను కూలి తెస్తూ, ఇంట్లో చాకిరీ చేసే పని మనిషి మాత్రమే, సుగుణ జీతం మనిషి అనుకుంది. మొగుడి ఈడున్న సుగుణను పుల్లమ్మ క్షమించగలిగింది కానీ సుగుణ లేనప్పుడు తన పక్కన చేరే మొగున్ని క్షమించలేకపోయింది. వెంకటముని మీద అక్కసు పట్టలేకపోయింది. ఒక నిశ్చయానికి వచ్చింది.

"మా ఊరికి పోతా", అంది ఒకరోజు సవతి ఇంట్లో లేంది చూసి.

"మీ నాయన చావుకూ, దివసానికీ పోయ్యొస్తివి, ఆ మధ్య, ఆర్నెళ్ల కిందట. ఇక్కడ నీకేం తక్కువ? సుగుణ జీతం చేదా? తను నీకు సరిపడదా? ఎప్పుడన్నా టి.వి.

సీరియల్లు చూసినావా? వాటిలో ముగ్గురు నలుగురు పెండ్లాలుండేవాళ్ళు కన్పిస్తారు".

పుల్లమ్మ మారు మాట్లాడలేదు. మొగుడిమీద తన అసహ్యాన్ని అణచుకుంది. మనసు విరిగి, పుట్టినింటికి చేరింది. తల్లితో, తమ్ముడితో, మరదలితో తన గోస చెప్పుకుంది. తల్లి మొత్తుకుంది. అల్లుడిని నానా తిట్లూ తిట్టింది. పంచాయతీ పెట్టిస్తాం అంది. పుల్లమ్మ తన తెగతెంపుల నిర్ణయం చెప్పింది. తమ్ముడు పుల్లన్న "నువ్వు అనుకునేదే మంచిది. ఈడనే ఉండు, అన్నిటికీ నేనుండాలే" అన్నాడు.

పుల్లమ్మకు తమ్ముడి మాటలతో ఓదార్పు దొరికినట్లయింది. తండ్రి చనిపోయాక వచ్చిన గ్రామసేవక ఉద్యోగంలో తమ్ముడు మారిపోయాడని, పెద్దరికం వచ్చిందనీ అనుకుంది. నెలనెలా వచ్చే జీతంలో ఇంటికి ఏమాత్రం ఖర్చుపెడుతున్నాడో చూశాక, తమ్ముడిలో ఏరకం మార్పు వచ్చిందో, ఏ పెద్దరికం చోటు చేసుకుందో పుల్లమ్మకు తెలిసివచ్చింది. "ఒక రూపాయ ఇవ్వరా పుల్లన్నా- వక్కలాకులకు" అని తల్లి నోరు తెరిచి అడిగినా, "పుల్లక్కను అడుగు. నాకు రకరకాల కర్చులుంటాయి. నేను మొగోన్ని" అనడం పుల్లమ్మ నాలుగైదుమార్లు వింది. మరదలు నోరు చచ్చిందని గ్రహించింది. ఆ పిల్లకున్నది మూడు పాత చీరలే అని తెలుసుకుంది. తాను పని చేసే ఇండ్లల్లో ఆయమ్మా ఈయమ్మా ఇచ్చిన అయిదారు పాత చీరెల్ని మరదలికిచ్చింది. తమ్ముడికి పట్టని సంసారాన్ని తను నెత్తికెత్తుకోవడం పొరపాటేమో అని చాలామార్లు అనుకుంది.

ఇంటి సరుకుల కోసం ఒకరోజు అంగడికి పోయినప్పుడు, అంగడి ఆమె ముఖం మీద అననే అంది:

"ఎందుకు పుల్లమ్మా ఇంత తాపత్రయం, తమ్ముడంటే. వాడి సోకులూ, సిగరెట్లూ, తాగుడూ సూసినావా? అమ్మే వాన్ని సగం చెడగొట్టింది. నీ సంసారం చెడె. నువ్వు రెక్కలు ముక్కలు చేసుకొని అంతా వీడి బొక్కనపెడితే, ముందు ముందు ఎట్లా?"

"పిల్లా జెల్లా పుడితే ముందు ముందు ఎట్లారా, పుల్లన్నా? ఊర్లో అందరూ నిన్ను గురించే అంటున్నారు," అంది తమ్ముడితో, ఆరోజు రాత్రి పుల్లన్న ఇంటికి వచ్చినప్పుడు.

పుల్లన్న తూలుతూ వెకిలి నవ్వు నవ్వి, "మేనత్తవు నువ్వుండావు పుల్లక్కా" అన్నాడు. ఆ మాటతో పుల్లమ్మ చల్లబడిపోయింది.

ఆ ఆదివారం పుల్లన్న అరకేజీ పొట్లేలు మాంసం ఇంటికి తెచ్చి వండమని భార్యకిచ్చాడు. "మసాలాకు..." అని పెండ్లాం గొణిగింది. పోయిన వారమే 'ఇంటి ఇల్లాలు', పుల్లమ్మకు పెట్టిన ధనియాలూ, ఎండు మిరపకాయలూ పుల్లన్న చూసే ఉన్నాడు. అయితే వాటిని ఇంట్లో అక్క ఎక్కడ దాచిందీ తెలియలేదు. వెతికి పట్టుకొని భార్య చేతికిచ్చాడు. ఒల్లు నొప్పుల బాధలో పుల్లమ్మ ఇదంతా గమనిస్తూనే ఉంది. ఒక్క మాట మాట్లాడలేదు. 'ఈ పొద్దూ, ఆ పొద్దూ వండే ఆ బియ్యం కూడా పనికి ఆహారం పథకం కింద తను తెచ్చినవే,' అని పుల్లమ్మ గుర్తు చేసుకుంది.

ఈలోగా ఒక ముసలామె వచ్చి, పుల్లమ్మను పిలిచింది:

"అమ్మేయ్, పుల్లమ్మా! రెడ్డేరింటికి పైగా ఉండే సోమక్క మనుమరాలు- కొడుకు కూతురు- సమర్త అయింది. చలిబిండీ, నూగుబిండీ దంచడానికి నిన్ను రమ్మంది సోమక్క"

ముసలామె వెంట, పుల్లమ్మ వెళ్లింది.

"సియ్యలు ఉడికినాయి," అని భార్య చెప్పింది. ఊళ్లోని బెల్ట్ షాపు నుంచీ తెచ్చుకున్న చీప్ లిక్కర్ రెండు సీసాల్ని పుల్లన్న దట్టించాడు. అన్నం ముందు కూర్చున్నాడు. మాంసాన్ని అన్నంలో కలుపుకుంటూ, బేసం ఎముకల్ని కొరికి పీలుస్తూ, ఎముకల్ని పటపటా నములుతూ కుండలో ఉండేదంతా ఊడ్చుకొని తిని, చేతులు నాక్కుంటున్న మొగుణ్ణి చూసి, పుల్లన్న భార్య కిమ్మనలేదు.

పుల్లమ్మ పని పూర్తి చేసుకొని వచ్చింది. పనికి పోయిన వాళ్ల చేతుల్లో పెట్టిన ఒక చలిబిండి ఉంటనూ, ఒక నూగుబిండి ఉంటనూ తెచ్చి తల్లికిచ్చింది. నులక మంచం మీద భుక్తాయాసంతో సిగరెట్టు కాలుస్తున్న కొడుక్కు- తను తెచ్చి ఇచ్చిన వాటిని తల్లి ఇవ్వడం చూసింది. పుల్లమ్మతో తల్లి అంది:

"అన్నం తిందాం పా! ఆయమ్మి కూడా తిన్లేదు. నీ కోసమే చూస్తాందాం."

ముగ్గురూ అన్నం ముందు కూర్చున్నారు. పుల్లమ్మకు ఆకలిగా ఉంది. నలత వల్ల విసుగ్గా ఉంది. తెల్లన్నం మీద ఎర్రగడ్డ కారం ఉంది. తల్లి ఆ కారంతో అన్నం కలుపుకుంటోంది. పల్లెంలోకి చూస్తున్న పుల్లమ్మతో మరదలు పీల గొంతుకతో అంది: "సియ్యల కూర అయిపోయింది, అంతా...," అని. వట్టి కుండ చూపింది.

అన్నం ముందు నుంచీ పుల్లమ్మ విసురుగానే లేచింది. కైపు కళ్లతో, చలిబిండి ఉంటను నమిలి మింగి, నూగుబిండి ఉంట పనిబడుతున్న తమ్ముని ముందు వెళ్లి "ధూ" అని కేకరించి మూసింది.

పుల్లన్న కొన్ని క్షణాలు బిత్తరపోయాడు. నోట్లో పెట్టుకుంటున్న నూగుబిండి ఉంట ముక్క జారి పడింది. తేరుకొని "ఏంది పుల్లక్కా?" అన్నాడు, ధైర్యం తెచ్చుకుంటూ.

"నీది మనిషి పుట్టుకేనారా! ముసల్దానికీ, కట్టుకున్న దానికీ రెండెముకలన్నా, గంటెడు పులుసన్నా మిగిలించి చావలేవా? కడుపుకు అంతా చించుకోవడమేనా? నేను నోట్లో పెట్టుకోకుండా, చలిబిండి, నూగు బిండి రెండుంటలు తెస్తి. కన్న తల్లికిస్తి. వాటినీ నీ కడుపుకు కొట్టుకుంటున్నావు. మనమ్మది నోరు కాదా? కడుపు కాదా? మాకు అవి లేవనుకున్నావు రా. ఏం బతుకురా నీది...," పుల్లమ్మ విరుచుక పడింది.

పుల్లన్న అక్క మీద విషం గక్కాడు:

"ఇదుగో పుల్లక్కా! జాస్తి పడతండావు. అవును. తిన్నాను. తింటాను. నా నోరే నాకు సొరగం. నా కడుపే నాకు కయిలాసం. ఏంది నీలుగుతున్నావు? నేను మొగోణ్ణి. మొగుణ్ణి వదిలేసిందిలే. ఏదో తోడబుట్టింది పాపం... అనుకుంటే-"

పుల్లమ్మ ఆ మాటలకు తట్టుకోలేకపోయింది.

"అవున్రా! మొగున్ని వదిలేసి వచ్చినా. వాడి కొవ్వు చూసి వదిలిపెట్టినా. వాడు కూర్చోబెట్టి సాకలేదు. ఇప్పుడు నువ్వూ అంతే. ఇది నా ఇల్లు. గవర్నమెంటు కట్టిచ్చింది. ఈ ఇంట్లో సగం సామాన్లు నావి. ఈ ఇంట్లో బియ్యం నావి. రోజూ నువ్వు మెక్కే కూరా నారా నావి," అంటూ ఆ ఆవేశంతోనే తల్లిని పిలిచింది.

"అమ్మోవ్! వస్తే నా వెంటరా. నేనేది తింటే నీకది పెడతా. వలపక్షం ఉండదు. కొడుకు మీదనే ప్రేమ కారిపోతా ఉంటే, ఇక్కడే ఉండు. నీ సావు నువ్వు సస్తావు. వీడు కడుపు నిండా కట్టుకున్న పెండ్లాన్నే తిననీడు. నీకేం పెడతాడు? నాకేం పెడతాడు? నాకు నా రెక్కలున్నాయి. ఉన్నన్నాళ్లూ తిండి గడవకపోదు. రా. మన బతుకు మనం బతుకుదాం. మొగుడొక పోతురాజు. వీడొక దేవర దున్నపోతు..."

పుల్లన్న అక్కను కొడదామనుకున్నాడు. కైపుతో లేచే శక్తి లేకపోయింది.

పుల్లమ్మ తమ్ముడితో తెగతెంపుల హెచ్చరిక చేసింది:

"నాలుగు రోజుల్లో నీ గుడిసెకు నువ్వు పో. నా ఇండ్లు నాకు వదులు. ఎవరి దగ్గర, ఏం పంచాయితీ పెట్టుకుంటావో పెట్టుకో. నా మాదిరి ఆడోళ్లు ఈ ఊర్లో ఉండనే ఉన్నారు. మొగంమీద ఎంగిలి ఊసేది తెలిసొస్తుంది."

పుల్లన్న 'నేను మొగోణ్ణి' అనే ఊతపదాన్ని ఎత్తుకోడానికి పెదాలు సహకరించలేదు. ధైర్యం కూడగట్టుకోడానికి భార్య దిక్కు చూశాడు. ఆ పిల్ల అత్తవైపు చూస్తూ 'ఇట్లాంటి మొగోళ్లకు ఇట్లాగే మెట్టు (చెప్పు) దెబ్బలు పడాల్సిందే" అని లోలోపల సంతోషపడుతోంది.

పుల్లమ్మ తల్లితో "వస్తావా? రావా? ఇప్పుడు తోడబుట్టినోన్నీ వదిలేస్తున్నా" అంది.

పుల్లమ్మను తల్లి అనుసరించింది.

కైపు దిగిపోయిన పుల్లన్నకు వీధిలో మాటలు విన్పిస్తున్నాయి.

"ఏమ్మేయ్ పుల్లమ్మా! రేపు ఇండ్లలకను రావాల."

"ఎందుకు రానమ్మా. వస్తా. ఏ పని కన్నా వస్తానని మనూర్లో రైతులు అందరికీ తెలుసు గదమ్మా. ఒక మూడు రోజులు ఎవరన్నా నన్ను గురించి అడిగితే మాత్రం రెడ్డేరి కల్లంలో బండ్ల మిద్దెలో నేనూ, మా యమ్మా ఉంటామని చెప్పు. నేనెక్కడుండేదీ నలుగురికీ తెలవాల గదమ్మా! ఎందుకంటున్నావా? తెలిస్తాదిలే..." ●

## ప్లీజ్ నన్ను లేపొద్దు!!

వర్తమానం హాలాహలాన్ని
కంఠంలో దాచుకున్న శివుణ్ణి!
కళ్లు తెరిస్తే
ఏమి అఘాయిత్యం
చూడాల్సి వస్తుందోనని
దొంగ తపస్సు నటించే
మధ్య తరగతి జీవుణ్ణి!
ఎంతటి ఉపద్రవం ముంచుకొచ్చినా
చలించని నిస్తేజుణ్ణి!
ప్లీజ్ నన్ను లేపొద్దు!!
నన్ను
ఈ సుషుప్తిలోనే వుండిపోనీ!
నాకు అందని
బంగారు రంగుల కలల్ని
ఇంకా ఇంకా అందుకోనీ!!

-బద్ది నాగేశ్వరరావు